# అవినీతి పడగనీడలో




ఆగమేఘాల మీద, అత్యంత వేగంగా దుమ్ము లేపుకుంటూ, హారన్ మోగించుకుంటూ పోలీసు జీపు వచ్చి ఆగింది. ఇన్‌స్పెక్టర్, అయిదారుగురు జవాన్లు హుటాహుటీన దిగారు. ఆ వెనుకే పదిమంది కూలీలతో లారీ వచ్చింది. ఆ వీధిలో తిరిగే వారంతా ఒక్కసారి నిశ్చేష్టులై ఆగి, తదేకంగా అక్కడేం జరుగుతుందో చూడసాగారు. పరుగు పరుగున పోయే కార్లు, స్కూటర్లు, సైకిళ్లు అన్నింటికి తక్షణం బ్రేకులు పడ్డాయి. రోడ్డుకి అటూ ఇటూ వున్న షాపులు, కిళ్లీబడ్డీలు, తోపుడు బళ్ళ వాళ్ళు బేరాన్ని పక్కనపెట్టి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. కారులు, బస్సులకు మాత్రం దారి దొరికింది. మెల్లగా వెళ్లిపోసాగాయి.

పోలీసు ఇన్‌స్పెక్టర్ లాఠీ పట్టుకుని తన పోలీసుల బలగానికి ఆర్డర్లు పాస్ చేస్తున్నాడు.

"ఎవరినీ దగ్గరకి రాకుండా జాగ్రత్తలు తీసుకోండి" జవాన్లను హెచ్చరించాడు. ఆగి ఉన్న లారీ నుంచి పది మంది కూలీలు, ఒక సూపర్‌వైజర్ దిగి, తమతో పాటు గునపాలు, పారలు, గమేళాలు అన్నీ దించారు.

సూపర్‌వైజర్, పోలీసు ఇన్‌స్పెక్టర్ ముందుకు కదిలారు. ఆ వెనుకే అక్కడున్న అయిదంతస్తుల అపార్ట్‌మెంట్ పైకి పనిముట్లతో వెళ్లారు.

"ఊ! ఈ రెండు అంతస్థులు పూర్తిగా గోడలు, స్తంభాలు, తలుపులు అన్నీ పడగొట్టి కిందకి తోసేయండి" అని సూపర్‌వైజర్ కూలీలందరికీ సూచించాడు.

కూల్చడం మొదలుపెట్టారు. సిమెంట్ దిమ్మలు, ఇటుకలు, ఇసుక అయిదో అంతస్తు మీద నుంచి రివ్వున కింద పడుతున్నాయి. దుమ్ము, ధూళి గాలిలో కలిసి ఆ చుట్టుపక్కలున్న వారి మీదికి ఎగిరి పడసాగాయి. అక్కడ మూగి ఉన్న జనంలో నుంచి గుసగుసలు మొదలయ్యాయి. అందరికీ వింతగా, విడ్డూరంగా తోచింది.

"అయ్యా!అదేంటీ బాబూ, ఇంత చక్కని బిల్డింగ్ అలా కొట్టిపారేస్తున్నారు"?

"కోర్టు ఆర్డరు అయ్యింటుంది. పోలీసులు కూడా కాపలా కాస్తున్నారు కదా!"

"ఈ రోజుల్లో చిన్న ప్రహరీగోడ కట్టుకోవడానికే సవాలక్ష ఆలోచిస్తాం. అంత డబ్బుపోసి కట్టిన ఇల్లు కూలదోస్తున్నారంటే మనసు ఉసూరుమంటుంది సుమండీ"!

"ఇంతకీ ఆ అపార్ట్‌మెంట్ ఓనర్స్‌కి తెలుసో, తెలీదో?"

"అపార్ట్‌మెంట్స్ కదండీ! రూలు ప్రకారం కట్టి ఉండరు. కాంట్రాక్టర్లు ఎంతసేపూ దోచుకోవడమే గానీ ఇలాంటివి చూడరు"

"డిపార్ట్‌మెంటు వాళ్ళు చాలా స్ట్రిక్ట్‌గా చూస్తున్నారు. అన్నీ కరెక్టుగా ఉండాలి మరి"

"మరైతే నష్టపోయేదెవరు, ఓనరా, కాంట్రాక్టరా?"

"ఎవరైనా నష్టం భరించడమంటే మాటలా! ఏ నష్టపరిహారమో కట్టించుకుని వదిలేయాలి గానీ, మరీ యింత దౌర్జన్యం కూడదండీ!"

" బాగా చెప్పారు, అయిదంతస్తుల మేడ ఈ ఊరికి, వీధికి గొప్ప అందం తెచ్చిందనుకున్నాం"

అటూఇటూ పహారా కాస్తున్న జవాను విసుగు చెంది " వెళ్ళండి, ఈ దుమ్మూ ధూళిలో

మీకేంపని" అంటూ అథార్టీగా చెప్పాడు.

ఒక్కొక్కరూ నెమ్మదిగా కదిలారు.

రెండు ఆటోల్లో హడావిడిగా కొంతమంది దిగారు. అప్పటికే కారు దిగి, సిగిరెట్ ముట్టించుకుని, పడగొడుతున్న బిల్డింగ్ వైపు తదేకంగా చూస్తున్నాడు కాంట్రాక్టర్. భూకంపం వస్తే ఎలా వుంటుందో అలా శిథిలావస్థలోకి వచ్చింది ఆ భవనం.

బిల్డింగ్ ఓనర్స్ అంతా కాంట్రాక్టర్ చుట్టూ మూగారు. కూలగొడుతున్న తన ఇంటికి చూసి తట్టుకోలేకపోయిన ఒక ముసలాయన కళ్ళు తిరిగి పడిపోయాడు.

"అయ్యా! కమలాకరంగారు పడిపోయారు"అని ఒకరు అరవగానే, నీళ్లు తెచ్చి ముఖానికి చల్లి, మెల్లగా మారుతి వ్యాన్‌లోకి ఎక్కించి పడుకోబెట్టారు.

కమలాకరం ముప్పై మూడేళ్లు సర్వీసు చేసి రిటైరయ్యాడు. గవర్నమెంట్ క్వార్టర్లో ఉండి ఉండి విసుగెత్తి, రిటైర్‌మెంట్ గ్రాడ్యూటీతోనైనా సొంత ఇల్లు కొనుక్కొని, శేష జీవితాన్ని గడపాలనుకున్నాడు. విధి వక్రించిందని తెలిసి తట్టుకోలేక, గుండె బరువెక్కి పడిపోయాడు.

"అపార్ట్‌మెంట్ తీసుకున్నాం. కట్టించింది అలా పడగొట్టేస్తుంటే ఊరు కుంటారేం?"

ఉద్రేకపడుతూ ఎగిరిపడ్డాడు ఒక ఓనరు కాంట్రాక్టర్ మీద.

"మీ సొమ్ము నేనేదో తినేసినట్లు మాట్లాడతావేమిటి? మీ ఫ్లాట్ కనస్ట్రక్ట్ చేశానా! ఏదో తిరకాసు వచ్చి వుంటుంది. పడగొడుతున్నారు. నష్టపరిహారం ఇస్తారుగా, మీ పోర్షన్ మీకు కట్టిస్తారు" అంటూ కళ్ళు పెద్దవి చేస్తూ,అరిచినంత పనిచేశాడు కాంట్రాక్టర్.

"ఏమండీ! నేను వి.ఆర్ తీసుకొని, ఆ వచ్చిన డబ్బుతో పిల్ల పెళ్ళి చేసి అపార్ట్‌మెంట్ తీసుకున్నాను. మా దురదృష్టం మమ్మల్నిలా వెంటాడుతుందనుకోలేదు. ఇప్పుడు మా గతి ఏమిటి? అంటూ ఆక్షేపించాడు మరొకాయన.

"మీరిలా ఒకరొకరు తిరగబడితే నేనేం సమాధానం చెబుతాను. నష్టపోయేది మీరొక్కరే కాదుగా! నాకూ చెప్పలేనంత లాస్ వచ్చింది" సంజాయిషీగా అన్నాడు కాంట్రాక్టరు సహనం పాటిస్తూ.

"మీరేదో ప్లాటు త్వరగా ఏర్పాటు చేస్తానంటే ఆఫీసులో, బ్యాంక్‌లో అప్పుచేసి డబ్బు కట్టాను. ఇక్కడ చూస్తే మాకళ్ళ ముందే బిల్డింగ్ అంతా కొట్టిపారేస్తున్నారు. కారణం చెప్పండి.

ప్లాన్ లేకుండా ఎలా కడతారు. అది కాదు. ఇంకేదో వుండి వుంటుంది" ఒక మధ్యవయస్కుడుఅందరినీ తోసుకుంటూ ముందుకొచ్చి అడిగాడు.

కాంట్రాక్టర్ని మాట్లాడనివ్వలేదు. ఒకరు ఒక పక్కకు లాగితే, మరొకరు మరో పక్కకు తోసేస్తున్నారు.

"మీ అందరి బాధ నాకు అర్థమవుతోంది. అవేశపడిపోయి అర్థంలేకుండా మాట్లాడితే జరిగేదేమీలేదు. వివరాలన్నీ కనుక్కుంటాను. దయచేసి ఎవరూ ఇరిటేట్ అవకండి. నా ఆఫీసురూంకి రండి. మాట్లాడుకుందాం." అంటూ దూకుడుగా అందర్నీ విడిపించుకుంటూ ఎస్టీమ్ కారు దగ్గరకెళ్ళి డోరు తెరిచాడు.

కాంట్రాక్టరు డ్రైవ్‌చేసుకుంటూ వెళ్లిపోయాడు.

బాధితులంతా అక్కడే గుమిగూడి తమ బాధల్ని ఒకరికొకరు చెప్పుకుని ఉపశమనం పొంది, మళ్ళీ అంతా జత కూడి కాంట్రాక్టరు ఉండే ఆఫీసు రూమ్‌కి వెళ్ళారు.

కాంట్రాక్టర్ ఆఫీసు రూమ్‌కి రాగానే క్లర్క్ నమస్కారం చేస్తూ, "సార్! చాలామంది మీకోసం ఫోన్ చేశారు. మీతో మాట్లాడాలట" అని చెప్పాడు.

"సరే సరేలే! ఎవరడిగినా లేనని చెప్పేయ్ ముందు ఆ బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్‌కి ఫోన్ కనెక్ట్ చేయి" అన్నాడు చీరాకు ప్రదర్శిస్తూ.

వెంటనే ఫోన్ కనెక్ట్ చేసి ఇచ్చాడు క్లర్క్.

"హలో! ఇన్‌స్పెక్టర్ గారూ, నేను కాంట్రాక్టరుని, ఏమిటిలా జరిగింది. పది లక్షలు అడిగిన వెంటనే మామూళ్ళు చెల్లిస్తే వంద గజాల్లో అయిదు అంతస్తులు కట్టేసినా పరవాలేదన్నారు. ముడుపులన్నీ తీసుకుని పర్మిషన్ ఇచ్చినట్లే ఇచ్చి, కట్టిన బిల్డింగ్ అంతా ఒక్క ఇటిక బెడ్డ మిగలకుండా తవ్విపారేశారు. ఏభై లక్షలు నష్టాన్ని ఎలా భర్తీ చేయిమంటారు? ఓనర్స్ అంతా కలసి నా ఒంట్లో ఎముకలు లేకుండా చితగొట్టేటట్లున్నారు. నన్నేం చేయమంటారో చెప్పండి అంటూ గబగబా మాట్లాడేసి ముఖానికి పట్టిన ముచ్చెమటల్ని తుడుచుకోసాగాడు.

"ఎన్నో ఒడిదుడుకుల్ని చూసిన మీరే అలా భయపడిపోతే ఎలాగండి! మీకు అప్పుడే చెప్పాను. పై లెవల్లో మరో అయిదు లక్షలు పంపిస్తే నోరు మెదపకుండా ఊరుకుందురు. గప్‌చుప్‌గా మీరు మరో అంతస్తు వేసుకుని పాతిక లక్షలు సంపాదించుకునేవారు.

సరేలెండి, అయిందేదో అయింది. ఆ వచ్చిన వాళ్ళకు మీదేమీ తప్పులేదని, అంతా ప్లాన్ ప్రకారమే కట్టానని, కోర్టులో చాలెంజ్ చేస్తానని చెప్పండి. వాళ్ళకు నోరే గానీ గుండె ధైర్యం లేదు. మీరెండో అపార్ట్‌మెంట్‌కు పర్మిషన్ శాంక్షన్‌కు పెట్టాను. మొదటి దఫా ఆరులక్షలు ఎప్పుడిస్తారు? అది వెంటనే సెటిల్ చేయకపోతే మరో స్ట్రోక్ తగులుతుంది. మీ ఇష్టం. రేపు వచ్చి ఫైనల్ చేయండి " అంటూ అవతల వ్యక్తి ఫోన్ పెట్టేశాడు.

కాంట్రాక్టర్ ముఖం వెలవెలబోయింది. మరో గ్లాసు మంచినీళ్ళు గడగడ తాగేశాడు.

అప్పటికే బిల్డింగ్ ఓనర్స్ అంతా వచ్చి ఎదురుగా కూర్చున్నారు. అందరి వంకా ఒక మారు దీనంగా చూశాడు.

" ఇప్పుడే మాట్లాడాను. అన్నీ సరిజేస్తానన్నారు. వర్రీ అవకండి. కాంపెన్సేషన్ కూడా వస్తుంది. కొంచెం ఆలస్యం అయినా మీ అపార్ట్‌మెంట్ పూర్తి చేసి ఎవరిది వారికి అప్పుచెప్పుతాను. జరిగిన దానికి నేను విచారిస్తున్నాను"అన్నాడు కాంట్రాక్టర్ విచారిస్తూ.

" మళ్ళీ అప్పుడు కూడా ఇలా జరగదని ఏమిటి గ్యారంటీ?"

"పూర్తిగా కట్టిన బిల్డింగ్ కూలదోయడంలో ఏదో గూడుపుఠాణి వుంది. మీరు దాస్తున్నారు చెప్పండి"

" ఆవేశపడకండి ఇందులో రహస్యమేమీలేదు. టూ బెడ్‌రూమ్ ఫ్లాటు ఒకటి ఇరవై లక్షల వరకు రేటు ఫిక్స్ చేసాను. అది రెండు కోట్ల ప్రోజెక్టు. యాభై లక్షల వరకు అన్ని స్థాయిల్లో ముడుపులుగా చెల్లించాను. సెల్లార్ ఆక్రమణ, స్పేస్ పోర్షన్ అన్నింటికి అనుమతి వచ్చింది. అయితే, మీరు సరితూగలేనన్నారు. అప్పుడు పది లక్షలకే టేకప్ చేశాను. దీనికి ముందుగానే ఇరవై లక్షలు అందరికీ చదివింపులు జరిగాయి. ప్లాన్ క్లియరెన్స్ పర్మిషన్ వచ్చాయి ఈ లోటుపాట్లు. మీకు తెలియవు" అన్నాడు సీరియస్‌గా కాంట్రాక్టర్ ఎవరికీ అర్థంకాని లెక్కలు చెపుతూ.

అయితే వచ్చిన ఓనర్స్ అంతా తమ కోపాన్ని, ఆవేశాన్ని చల్లార్చుకుంటారని అనుకున్నాడు. కానీ, అందరూ ఏదో తేల్చుకుందామనే ఉద్రేకంతో వున్నారు.

" ఇంత బాహాటంగా శ్రుతిమించిన అవినీతి జరిగిపోతుంటే అంతా కళ్ళు మూసుకుంటున్నారా?" ఉరుములా విరుచుకుపడుతూ అడిగాడు ఒకాయన.

కాంట్రాక్టర్ నోరు మెదపలేదు.

" ఏం చెప్పరేం, మాట్లాడండి " అంటూ అంతా అరిచారు.

" ఏం చెప్పమంటారు! అక్కడ అవినీతి మర్రిఊడల్లా పాతుకుపోయింది. మీకు అందరికీ తెలుసు. మామూళ్ళ రూపంలో బహిరంగంగా డబ్బు దండుకుంటున్న ఆనవాయితీ ఎన్నో ఏళ్ళుగా ఉంది. ఎక్కడెక్కడ వాటాలు పంచుకుంటూ, ఎవరిపైనా ఎటువంటి చర్యలు లేకుండా జాగ్రత్త పడుతుంటారు. అటువంటి లావాదేవీలు రాత్రి పొద్దుపోయే వరకు జరుగుతాయి. అదొక పెద్ద సుడిగుండం. చిక్కిపోవడమే గాని వెనక్కి తిరిగొచ్చే ప్రసక్తిలేదు"

" మేమంతా ఆ అవినీతిని అడ్డుకుంటాం. పట్టుకుంటాం. చట్టానికి అప్పజెబుదాం" అన్నారు ఉడుకునెత్తురు సలసల కాగుతున్నవారు.

" అది అంత తేలికకాదు. అక్కడ ఎవరు సిబ్బందో, ఎవరు ప్రజలో, ఎవరేపనిమీద వచ్చారో, ఎవరు బ్రోకరో ఏమీ అర్థం కాని రీతిలో మార్కెట్ ఉంటుంది. 'పనికావాలి'? అనే తాపత్రయం తప్పించి, డబ్బుపోతుందనే బెంగ లేదు ఎవరికీ..."

" అయితే, రెడ్‌హ్యాండెడ్ గా పట్టుకోవడం ఎలా? అనుమానాస్పదంగా అడిగాడొకాయన.

" హోదా, స్థాయిని బట్టి కాసుల వర్షం కురుస్తుండడంతో లెక్కకు మించిన ఆస్తులు, సొంత పేర్ల మీద కాకుండా, బినామీ పేర్ల మీద దాచేస్తున్నారు. ఎవరూ అంత తేలికగా దొరకరు. ఎవరన్నా దొరికారంటే అతను అవినీతిలో పీకలవరకు మునిగిన వాడే అయ్యుంటాడు. హర్షద్ మెహతాల్లా అందరికీ తగినంత చెల్లింపులతో దర్జాగా మనముందే తిరుగుతాడు. చిల్లర నోట్లు ఎక్కడ దాచుకోవాలో తెలియక బ్యాంక్ వాళ్ళన ఆశ్రయించి కమిషన్ ఎరగా చూపించి అయిదువందల నోట్ల కింద మార్చుకునే వారున్నారు. అవినీతి మూడు మేడలు, ఆరు భవనాలుగా వర్థిల్లుతోంది. సిబ్బందికి వద్దంటే డబ్బు వచ్చిపడుతోంది. అధికారులు తమ నెల జీతాలు పాకెట్ మనీతో సమానంగా ఖర్చుపెట్టుకుంటున్నారు. రోజూ బ్రాందీ,విస్కీలతో విందులు చేసుకుంటూ సంతకాలు పెడుతున్నారు."

కాంట్రాక్టర్ మాటలకు కొందరు అడ్డొస్తూ " మీరేమో మహా నీతిమంతుల్లా మాట్లాడుతున్నారు, కాంట్రాక్టరయిన మీరే వారికి అవినీతి మప్పి, నేర్పించి, ప్రోత్సహిస్తున్నారు. మరో ప్రక్క కల్తీ సిమెంట్, సముద్రం ఇసుక, నాణ్యతలేని ఇటుకలతో అంతస్తులు కడుతున్నారు. ఇది అవినీతి కాదా, " చెప్పండి! మాట్లాడరేం " అంటూ

సవాలు విసిరినట్లు అడిగేసరికి కాంట్రాక్టరు ఒక్క నిముషం బిత్తరపోయి, అంతలోనే తేరుకొని

"అవును ఒప్పుకుంటున్నాను, కానీ తప్పనిపరిస్థితి. మేము అలా చేయకపోతే భారీ ఎత్తున ముడుపులు చెల్లించుకోలేం, కూలీలకు అధిక వేతనాలివ్వలేం యివన్నీ ఎలా జరుగుతాయనుకున్నారు" అన్నాడు కాంట్రాక్టర్ నిర్మొహమాటంగా.

"ఆ డబ్బంతా మేమే కదా ఇస్తున్నాం. ఆ సంగతి మరిచిపోయారు. మమ్మల్ని పట్టి పీడించి అధికంగా ధరలు పెంచి దేశంలో అన్యాయాన్ని, అవినీతిని పురికొల్పుతున్నది మీరే కదా!"

"నిజమే ఈ వ్యవస్థలోని అవినీతికి అందరం బాధ్యులమే. మీకు చవగ్గా ప్లాటు కావాలి. అది మేము అతి తక్కువకు కట్టి ఇవ్వాలి. అన్ని సదుపాయాలతో అధునాతనంగా ప్లాన్ శాంక్షన్ కావాలి. ఈ ఎడ్జస్ట్‌మెంట్‌లోనే అవినీతి ఉంది. ఒకరినొకరం మోసం చేసుకోకపోతే గడవదు." అన్నాడు కాంట్రాక్టర్ వినయంగా జగమెరిగిన సత్యం పలికినట్లు. అందరిలో సహనం చచ్చిపోయింది, తమ చోటు వదిలి ముందుకొచ్చారంతా.

"అన్యాయంగా నష్టపోయింది మేమే గనుక, మా ప్లాట్ల విషయంలో ఎవరెవరు ముడుపులు తీసుకున్నారో అందర్నీ రేపు మాకు చూపించండి. ఈ దెబ్బతో తెరవెనుక బాగోతం అంతా బట్టబయలు కావాలి" అంటూ అంతా ఒక్కమారు లేచి" పేపరుకి ఎక్కిస్తాం, కోర్టుకు వెళతాం. న్యాయం జరగాలి." అన్నారు పెద్దపెట్టున అరుస్తూ , దానికి అందరూ వంత పలికారు.

"సరే! రేపు డిపార్ట్‌మెంట్‌కి రండి అందర్నీ పేరు పేరున చూపిస్తాను. మీరేం సాధిస్తారో అదికూడా చూస్తాను" అని లేచి వెళ్ళి పోయాడు కాంట్రాక్టర్ ఏంచేయాలో తోచక.

బిల్డింగ్ ఓనర్స్ అంతా జరిగిన అన్యాయాన్ని ఒక పట్టుదలగా తీసుకొని అంతా ఏకమై అవినీతి నిర్మూలనకై కంకణం కట్టుకున్నామని, నిర్ణయించుకుని ఎవరిదారిన వారెళ్ళిపోయారు.

ఆ మర్నాడు వార్తాపత్రికలో ముందు రోజు జరిగిన సంభాషణ క్లుప్తంగా వచ్చింది. అధికారుల అవినీతి కుంభకోణాన్ని కాంట్రాక్టర్ బట్టబయలు చేస్తానన్న వార్త దావానలంలా అంతా వ్యాపించింది. అయితే, ఆ ఇన్ఫర్మేషన్ కమలాకరమే ఇచ్చిన సంగతి ఎవరికీ తెలియదు. బిల్డింగ్ ఓనర్స్ అంతా ఒకరొకరు డెవలప్‌మెంట్ ఆఫీసు ఆవరణలోకి

చేరారు.ఎదురెండ తీవ్రంగా ఉంది. మూడు గంటల సేపు అలా ఎదురుచూడడంతోనే గడిచింది. ఉక్కకి, దాహానికి తట్టుకోలేక విసుగెత్తిపోయారు.

కాంట్రాక్టర్ ఆచూకీ కనపడలేదు. అందరిలో ఏదో అనుమాన బీజం మొలకెత్తింది. ‘ మనల్ని నమ్మించి మోసం చేసి ఊరు విడిచి పారిపోయి ఉంటాడు’ అని కొందరు బులిటెన్ వదిలారు. “ ఆయన ఎక్కడున్నా పట్టి కొట్టి పోలీసులకు అప్పజెప్పాలి” అందరిలో కోపం కట్టలు తెంచుకుంది. ఓపిక, సహనం చచ్చిపోయింది.

అంతా కాంట్రాక్టరు ఆఫీస్ రూమ్‌కు బయలుదేరారు. తెరిచే ఉంది. ఎ.సి.రూమ్ అద్దాలు వేసి ఉన్నాయి. అందరిలో ఉద్రేకం కట్టలు తెచ్చేకుంది. దొమ్మీగా అద్దాల తలుపుల్ని బలవంతంగా తోసుకుంటూ లోనికి ప్రవేశించారు. అంతే భయంకరమైన, హృదయ విదారకమైన దృశ్యం కళ్ళబడింది. గుండెలదిరాయి.

కాంట్రాక్టర్ రక్తపు మడుగులో తేలి వున్నాడు. ఎవరో హత్య చేశారు. అందరి హృదయాలు జలదరించాయి. నిశ్చేష్టులయ్యారు. వెనువెంటనే పోలీసులు రంగ ప్రవేశం చేశారు. అవినీతికి ఊపిరిపోసిన కాంట్రాక్టర్‌ను అదే అవినీతి తిరిగి కాటువేసింది.

దిక్కుతోచని స్థితిలో అవినీతి పడగనీడలో బిల్డింగ్ ఓనర్స్ అంతా చేష్టలుడిగి చతికిలపడిపోయారు.

(ఇండియా టుడే 18-1-2000)